## వీరపల్లె వీణావాణి

# ప్రశ్నలకు అట్లూ ఇట్లూ




**సాయంత్రం**ఆరు దాటుతూంది.

ఎమర్జెన్సీ పీరియడ్‌లో విజృంభించిన పోలీ ్స డిపార్ట్‌మెంట్‌లా పగలంతా తన ప్రతాపాన్ని ప్రదర్శించిన సూర్యగోళం పడమటి కొండల్లోకి జారిపోతూంది. ఎన్నికల సమయాలలో తగలబడిపోయే హరిజనవాడలా సూర్యు డస్తమిస్తున్న పడమటి ఆకాశం ఎర్రగా నిగనిగలాడుతూంది.

ఆ ఇరానీ హోటల్లో కూర్చుని సుమారు పావుగంటనుండి నా మిత్రుల రాక కోసం ఎదురు చూస్తున్నాను నేను. ప్రతిరోజూ మా మిత్రబృందమంతా ఆ సమయంలో ఆ హొటల్లో కలుసుకుని టీలు తాగుతూ సరదాగా ఓ గంట గడపడం ఆనవాయితీ. అలా గడపని రోజు మాకెంతో వెలితిగా ఉంటుంది.

"క్యా సాబ్! మీ వాళ్ళంతా ఇంకా వచ్చినట్లు లేదే" అన్నాడు టేబుల్ దగ్గరి కొచ్చి సర్వర్ జాఫర్.

"వాళ్ళ కోసమే ఎదురుచూస్తున్నా. ఏ మొచ్చిందో వెధవలకి ఇంకా తగలడలేదు" అన్నాను విసుగ్గా.

అంతలోనే మహేంద్ర, దయాకర్, మూర్తి ముగ్గురూ హొటల్లోకి ప్రవేశించి నా టేబుల్ దగ్గరి కొచ్చి కూర్చున్నారు. మూర్తి ముఖం ఏదో ఆనందంతో వెలిగిపోతూంది. వాడు ఆనందం వచ్చినా పట్టలేడు. బాధ లొచ్చినా పట్టలేడు. మేం నలుగురం అక్కడుండడంతో మళ్ళీ వచ్చాడు. సర్వర్.

"నాలుగు టీలు." మూర్తి అన్నాడు.

"టీలతో సరిపెట్టుకుందామనుకుంటున్నావటోయ్! అదేం వీలుపడదు. ఈ శుభ సమయంలో బిస్కెట్లు తెప్పించు" అన్నాడు దయాకర్ మూర్తిని ఉద్దేశించి.

"శుభ సమయం అంటున్నావ్- ఏమిట్రోయ్ కథ? సుగుణ నుండి నీ ప్రేమ లేఖకి బదులుగానీ వచ్చిందా ?" అన్నాను మూర్తి వేపు చూస్తూ.

నే నలా అడగ్గానే మూర్తి తన షర్ట్ జేబులోంచి ఓ కార్డుముక్కను తీ ్సి నా చేతికి అందించాడు. ఒక ప్రముఖ వారపత్రిక నుండి మూర్తి కథ ప్రచురణకు అంగీకరింపబడినట్టుగా వచ్చిన కార్డు అది. మూర్తి అప్పుడప్పుడూ కథలూ గట్రా రాస్తుంటాడు. అవి గోడకే ్సిన బంతిలా తిరిగొస్తుంటాయి. అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా మా మూర్తి రాస్తూనే ఉంటాడు. పత్రికలకు పంపుతూనే ఉంటాడు.

ఇక మహేంద్ర మాటకొస్తే. . .

అతను కథలూ గట్రా రాయడు కానీ, ప్రతి పత్రికనూ వదలకుండా చదువుతాడు. ప్రస్తుతం పత్రికల్లో వస్తున్న సాహిత్యాన్ని చక్కగా విశ్లేషిస్తాడు. అద్భుతంగా విమర్శిస్తాడు. దయాకర్‌కి మాత్రం రచయితలన్నా, రచయిత్రులన్నా విపరీత మైన మంట. ఏవగింపుకూడా.

కారణం సమాజంలోని ప్రజల్ని ఎక్కువగా ఈ రచయితలూ, రచయిత్రులే వక్ర మార్గం పట్టిస్తున్నారని వాళ్ళలో నిజాయితీ బొత్తిగా లోపించిందని. నిజాయితీ అంటూ ఏ కోశానా లేని రచయితకు అసలు నిజాయితీ గురించి కథల్లో ప్రస్తావించే అర్హతే లేదని దయాకర్ వాదిస్తుంటాడు.

బిస్కెట్లు తినడం, టీలు తాగడం పూర్తి చే ్సి అందరం ్సిగరెట్లు ముట్టించాం. హొటల్ చాలా రద్దీగా ఉంది. మా చర్చ

ప్రజల ఉద్రేకాలను రెచ్చగొడుతున్న చెత్త సినిమాలతో ప్రారంభమై అటునుంచి రాజకీయాల మీదికి ఇటీవల ఓ పత్రికలో గెలుపొందిన కథల మీదికి మళ్ళింది.

"నేనో నిర్ణయానికొచ్చాను" అన్నాడు దయాకర్ సిగరెట్ పొగను గాలిలోకి వదులుతూ. మేమంతా వాడివేపు ప్రశ్నార్థకంగా చూశాం.

"ఆరు నెలల క్రితం చనిపోయిన మా అమ్మ జ్ఞాపకార్థం ఇకనుండి ప్రతి ఏడూ ఒక ఉత్తమ నవలను ఎంపిక చేసి అయిదు వందల రూపాయల్ని ఆ నవలా రచయితకు బహుమానంగా ఇవ్వాలనుకుంటున్నాను" అన్నాడు దయాకర్ సీరియస్‌గా మా ముఖాల్లోకి చూస్తూ.

దయాకర్ ఆ మాట అనగానే అంతవరకు కుర్చీలో కూర్చుని ఉన్న మహేంద్ర గబగబా పైకి లేచి ఆ హొటల్లోంచి కొంచెం బయటికి వెళ్ళి పరిశీలనగా ఆకాశం కేసి చూసి మళ్ళీ వచ్చి కూర్చున్నాడు. వాడెందుకలా చేశాడో నాకు బాగా తెలుసు. అయినా ఎందుకలా వెళ్ళిందని వాడిని అడిగాను.


"మరేం లేదోయ్! సూర్యుడు పడమటి దిక్కులో అస్తమించడానికి బదులు తూర్పు దిక్కులో గానీ అస్తమించాడేమోనని చూసి వచ్చానంతే." మహేంద్ర ఆ మాట అనగానే నేనూ, మూర్తీ పక్కున నవ్వేశాం. దయాకర్‌కి కడుపు మండిపోయింది.

"వేళాకోళం అనుకుంటున్నారా ?" దయాకర్ ఉడుక్కున్నాడు.

పొరబాటుగా పోస్టులో ఇరవై పైసల డ్యూతో వచ్చిన ఉత్తరాన్ని తీసుకోవడానికి నిరాకరించే దయాకర్- యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో పేస్టు కొంటే అనవసరంగా డబ్బు అయిపోతుందని హాస్టల్ ముందున్న వేపచెట్టులోంచి రోజూ ఒక వేపపుల్ల విరుచుకుని పళ్ళు తోముకున్న దయాకర్-

ఇన్‌లాండ్ కవరయితే ఎక్కువ ఖర్చవుతుందని ప్రతి ఒక్కడికీ కార్డులోనే ఉత్తరాలు రాసే దయాకర్- అందరిచేతా 'పిసినారి' అనే బలీయమైన ముద్ర వేయించుకున్న దయాకర్ ఇప్పుడు ఒక ఉత్తమ నవలకు తన తల్లి స్మృత్యర్థం అయిదొందల రూపాయల్ని బహుమానంగా ఇస్తానంటే మేమే కాదు, దయాకర్‌ని ఎరిగున్న ప్రతి ఒకడూ ఇది వింటే ఆశ్చర్యంలోంచి తేరుకోలేడు.

"నాకు తెలుసురా- మీరెవరూ నమ్మలేరు. నేను పిసినిగొట్టు అని మీ అభిప్రాయం. రచయితల నిజాయితీని నేను విమర్శించినంతమాత్రాన నాకు సాహిత్యం పట్ల అభిలాష లేనట్టా? ఒక మనిషి భుజం తట్టడమంటే అది అతని పై చేయి చేసుకున్నట్టా ? అప్పటికి మీరే పెద్ద సాహిత్యవేత్తలై పోయినట్టూ, నాకేమీ దానిపట్ల ఆసక్తి లేనట్టూ" అంటూ




కోపంగా వెళ్ళిపోయాడు దయాకర్.

మేం షాక్ తిన్నాం.

నిజంగా వాడికంత కోపం వస్తుందని, వాడిలో నిజంగానే సాహిత్యాభిలాష ఉందని మేమెప్పుడూ అనుకోలేదు. ఆ తరవాత దయాకర్ వారం రోజుల వరకు మమ్మల్ని కలవడం మానేశాడు. ఎక్కడైనా కనపడితే పిలిచినా పలకకుండా వెళ్ళిపోయేవాడు. అందరం కలిసి ఓ రోజు వాడికి క్షమాపణలు చెప్పాం.

ఆ తరవాత వాడు మాతో కలిశాడు.

ఓ రోజు నేను ఓ మాసపత్రిక చదువుతుంటే అందులో 'ఆదెమ్మ అవార్డ్' అనే ప్రకటన కనిపించింది.

"స్వర్గస్థురాలైన మా తల్లి శ్రీమతి ఆదెమ్మ స్మృత్యర్థం ప్రతి ఏటా మేము ఒక ఉత్తమ నవలకు అయిదు వందల రూపాయలు అవార్డుగా ఇవ్వదలిచాం. ఈ పోటీకి గత మూడేళ్ళలో ప్రచురింపబడిన నవలలను మాత్రమే పంపించాలి. వ్రాతప్రతులు, అనుబంధ నవలలు స్వీకరించబడవు. ఈ పోటీకి ప్రచురణ సంస్థలుకూడా నవలలను పంపించవచ్చును. అయితే బహుమతి ఆ నవలా రచయితకు మాత్రమే ఇవ్వబడుతుంది. బహుమతి పొందిన రచయితకు పోస్టులో అయిదొందలకు చెక్కు పంపబడుతుంది. ఈ పోటీకి నవలలను పంపువారు ఒక్కో నవల మూడేసి కాపీలు పంపాలి. మాకు . నవలలు చేరవలసిన గడువు తేది ఆగస్టు ముప్పయిఒకటి."

ఈ ప్రకటన క్రింద దయాకర్ అడ్రస్సు ఉండడంకూడా నాకు కనిపించింది. అయితే నిజంగానే దయాకర్‌కి సాహితీ సేవ చెయ్యాలనే తలంపు ఉన్నట్లు నాకప్పుడే అర్థమైంది.

"ఈ పద్ధతి ఏం బాగులేదోయ్. బహుమతి వచ్చిన రచయితను పిలిపించి ఓ సమావేశం ఏర్పాటుచేసి, అందులో ఆ బహుమతి అందజేసి ఉంటే చాలా బాగుండేది" అంటూ మహేంద్ర తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు.

"రచయితను పిలిపించడం, అతడికి లాడ్జింగ్ అండ్ బోర్డింగ్ ఏర్పాటు చెయ్యడం, ఒక సమావేశం అరేంజ్ చెయ్యడం, అందులో ఆ నవల వైశిష్ట్యాన్ని గురించి మనం మాట్లాడటం- ఇదంతా అనవసరమైన ఖర్చు ప్రయాసలతో కూడిన వ్యవహారం. అందుకే ఆ డబ్బును చెక్ రూపంలో ఆ రచయితకు పోస్టులో పంపబడుతుందని ప్రకటన ఇచ్చాను". అన్నాడు దయాకర్.

ఆ తరవాత ఆదెమ్మ అవార్డ్ నవలల పోటీకి వరుసగా నవలలు రావడం మొదలెట్టాయి. చివరి రోజున లెక్కపెడితే నూటపాతిక నవలలు మూడేసి కాపీల చొప్పున మూడు వందల డెబ్బైఅయిదు నవలలు వచ్చాయి. అన్నీ పెద్ద పెద్ద నవలలే. పది రూపాయల లోపు ఒక్క నవలకూడా లేదు.

ఆ నవలల్లో ఒక మంచి నవలను ఎంపిక చెయ్యవలసిన బాధ్యతను దయాకర్ నాకూ, మహేంద్రకూ, మూర్తికీ అప్పగించాడు. మేము ముగ్గురం మూడు నెలలు హొరాహొరిగా ఆ నవలలతో పోరాడి చివరికో నవలని సెలెక్ట్ చేశాం. ఆ నవలకి బహుమతి వచ్చినట్టు, ఆ నవలా రచయితకు అభినందనలు, ఆ సెలెక్షన్ విషయంలో సహకరించిన మాముగ్గురికీ కృతజ్ఞతలు తెలుపుతూ పత్రికాముఖంగా రిజల్ట్స్ ప్రకటించాడు దయాకర్. తరవాత మాముందే ఆ రచయితకి అయిదొందలకు చెక్‌ను పోస్ట చేశాడు దయాకర్.

నెల రోజుల తరవాత. . .

"ఒరేయ్, విశ్వనాథం. ఈ దారుణం విన్నావా! దయాకర్‌గాడు టేప్‌రికార్డర్ కొన్నాడట. ఆ డబ్బు ఎక్కడిదనుకున్నావ్ ? పోటీకి వచ్చిన మూడొందలా డెబ్బయిఅయిదు నవలల్ని ప్లాట్‌ఫారంపై పాత బుక్స్ అమ్మేవాడికి చవగ్గా వెయ్యి రూపాయలకు అమ్మేసి.

అంటూ చెప్పుకుపోతున్నాడు మహేంద్ర. నేను శిలలా బిగుసుకుపోయాను.

రచయితల నిజాయితీని గురించి విమర్శించి,ఆదర్శాలు వల్లించే దయాకర్. . .వాడి మీద నాకు కంపరం పుట్టింది. *